

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## పైలా పచ్చీసు
## ( 1975 అక్టోబర్ సంచిక విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)

***సుప్రసిద్ధ రచయిత ఆరుద్ర 'సినిమా రచన 'కు ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తయినాయి. ఈ సందర్భంగా 'రజతోత్సవ సభ' కూడా త్వరలో జరగనున్నది. ఈ తరుణాన్ని పురస్కరించుకుని, శ్రీ ఆరుద్రను అభినందిస్తూ ఈ ప్రత్యేక వ్యాసాన్ని పాఠకులకు అందజేస్తున్నాము.***




శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రిగారి మెప్పుబడిసిన పాట 'ఎవరు కన్నారెవరు పెంచారు.' ఆ పాట రచయితగా ఆరుద్రను రసికులు రస హృదయులూ కొలిస్తే, సినిమాల మనికికి జీవగర్రయిన ప్రేక్షకులూ, చిత్రగీతాల ఉనికికి కారణమైన అసంఖ్యాకులైన శ్రోతలూ తమ దృష్టినాకర్షించి మనసును ఆకట్టేసుకున్న పదులకొద్దీ పాటల రచయితగా ఆరుద్రను తలుస్తారు.

న్యాయపతి నారాయణమూర్తి (ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు) పిలుపున సాహిత్య వ్యాసంగ రంగ ప్రవేశం చేసిన ఆరుద్ర 1948లో శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ కథా విభాగంలో చేరి "సౌదామిని"కి సాహిత్యపు నగిషీలు చెక్కడమేకాక దర్శకుడు కడారు నాగభూషణం సహాయకులుగా కూడా పనిచేశారు. శ్రీ మల్లాది వారికి అదే కాలంలో శిష్యుడైన అశ్వద్ధామ జోక్యంతో

పక్షిరాజా వారి "బీదలపాట్లు"కు మూడు నాలుగు పాటలు వ్రాశారు.

సి.ఎస్.ఆర్. మొదలుపెట్టిన "రిక్షావాలా"కు రచన చేస్తున్నపుడే ఘంటసాల సొంత చిత్రం "పరోపకారా"నికి వ్రాశారు.

'హృదయమా భావ వేగాన సాగిపొమ్మా'లో తొంగిచూచే ముగ్ధత్వం నిజంగా మనోహరం. భరణి తీయదలచుకున్న "స్వీట్‌హోం"కి వ్రాస్తున్న సంభాషణలకు మురిసి దర్శకులు రామకృష్ణ రాజ్‌కపూర్‌కి అడగకుండానే సిఫారసు చేయడం "ప్రేమలేఖలు" ఆరుద్రకు దొరకడం జరిగింది.

అయితే మొదటిపాట "బీదలపాట్లు"(1950), మొదటి స్క్రిప్ట్ "పరోపకారం" (1953) , మొదటి డబ్బింగ్ చిత్రం "ఆలీబాబా నలభై దొంగలు" (1956) "రిక్షావాలా" ఆగిపోయింది. "స్వీట్‌హోం" "పరోపకారం"గా మారింది. "బీదలపాట్లు"లో యేయే పాటలు వ్రాశారో ఆయనకే జ్ఞాపకం లేదు. "ప్రేమలేఖలు" డబ్బింగ్ చిత్రం కాదు. తెలుగు మాటలు నటీనటుల చేతనే మాట్లాడించి తరువాత దానికి తెలుగు కంఠాలు కలిపారు.

ఇవీ ఆరుద్ర చిత్రరంగ ప్రవేశ దరువు. అంతకు కొంచెం ముందూ కొంచెం వెనుకా, యిటీవలి కాలంలోనూ సాగించిన రచనలు చిత్రాలకు సంబంధించినివి ఎన్నో వున్నాయి. 'సినీవాలి' (అంటే అర్థం – చంద్రకళ కనిపించే అమావాస్య, పార్వతీ, నిఘంటువు చూస్తేగాని తెలియలేదు). 'త్వమేవాహం', 'ఇంటింటి పద్యాలు ', 'గాయాలు గేయాలు' వంటి కవితాఖండికలు, పండిత ప్రకాండులను సహితం ముక్కున వేలేయించిన 'సమగ్రాంధ్ర సాహిత్యం' వంటి బృహత్ప్రయత్నాలూ, పూల్ సాహేబూ జులేఖా అనువాద బురఖాలతో అపరాధ పరిశోధక రాజ్యం చేసిన తరువాత నవ్యతకూ తెలుగుదనానికీ పట్టంగట్టిన "పలకల వెండిగ్లాసు" ఇత్యాది హత్యా సాహిత్యమూ, "ఊరు ఊరుకుంది" కథల సంపుటమూ, రమణమూర్తికి వ్రాసిచ్చిన "కాటమరాజు" నాటకమూ. అదే నటునికి "కన్యాశుల్కం" క్లుప్తీకరణా, ఆరుద్ర వేర్వేరు పేనాలకు అధిక చక్కని నమూనాలు. సినిమాలకు ఆరుద్ర కథలు వ్రాయకపోవడం ఆశ్చర్యమనుకునేకంటే వ్రాసిన కథలకు పేరివ్వమని నిక్కచ్చిగా అడగకపోవటం పొరబాటనుకోవడం సమంజసమనిపిస్తుంది. చిత్రసీమలో జరిగిన కొన్ని విషయాలు వింటే. "భీష్మ" (1962), "పాండవ వనవాసం" (1964) ఇత్యాది చిత్రాలకు పరోక్షంగా, "బాల భారతం" (1972) "యశోదకృష్ణ" (1974) దాకా విజయాన్ని సాధించుకున్న చిత్రాలే. ఆయన సంభాషణలలో ప్రత్యేకత తెరపై పాత్రలు మాట్లాడుకున్నట్లుకాక మనుషులు మాట్లాడుకున్నట్లుండటం.

ఇన్ని చేసినా ఆరుద్ర పాటల రచయితగానే పరిగణింపబడటానికి కారణం ఒకటి కాదు మూడు. సాహిత్య ప్రపంచ వ్యవసాయం యిందరకు తెలియకపోవడం. పాటలు గుర్తున్నంత సులభంగా ఒక చిత్రం సంభాషణలుగాని (ఊతపదాలు

తప్పించి), స్క్రీన్‌ప్లేగాని (గూఢచారి 116, అసాధ్యుడు, ది ట్రైన్) గుర్తుండక పోవడం మరొకటి. మూడవది అతి ప్రాథమికమైనది, ఆరుద్ర అంత బాగా పాటలు వ్రాయడమే.

ఆరుద్ర చిత్ర జీవిత రజతోత్సవ సమయాన్ని పురస్కరించుకుని ఎం.శేషాచలం కంపెనీవారు ప్రచురిస్తున్న ఆరుద్ర సినిమా పాటల సంకలనానికి (కొండగాలి తిరిగింది దాని పేరు) నన్ను పాటల యెంపిక చెయ్యమన్నారు. దాదాపు మూడువేల పాటల్లో అందుబాటులో వున్న వేయిపాటలు అలవోకగా చూసి, అందులో నాలుగువందలు నిశితంగా పరిశీలించి వాటిలో సుమారు 140 పాటలు నిగ్గు తేల్చేసరికి ఆరుద్ర రచనల ద్రాక్షాపాకం, వస్తువైవిధ్యం, కవితా సామగ్రి అవగాహనకొచ్చినవి.

ఒక సినిమా పాట ప్రజాదరణ పొందినా మనకు నచ్చినా దానికి ఒక్కటే కారణం అవడం అసంభవమనే చెప్పవచ్చు. ముఖ్య కారణాలు (మనిషి తత్వం అనుసరించి క్రమం మారినా) రచన, వరస, పాడుట, వాద్యగోష్ఠి. ఉపకరణాలుచిత్రీకరణ, పాత్రధారులూ, సన్నివేశం, యింకా యెన్నో. అయితే ఆ సంకలనం కోసం యివేవీ దృష్టిలో పెట్టుకొనక కేవలం కాగితం పైనే అందంగా వున్న, వుండగ, వుండగలిగిన పాటలు యెంచాను, అందులో కొన్నింటి అందాలు మీతో పంచుకొనడం యీ వ్యాసం ఉద్దేశం.

ఇన్నేళ్ళుగా సినిమాలలో స్థావరం యేర్పరచుకున్నవి కొన్ని రకాల పాటలు. ప్రేమగీతాలు, 'టీజింగ్' పాటలు, 'పాత్ర నిరూపణ' పాటలు. ఇక నైట్ క్లబ్బుల పాటలూ, కవ్వింపు పాటలూ, నిజానికి వీటిలో వుండే పోలికలెక్కువ, భేదాలు తక్కువా. యెవరు వ్రాసినా. అయినా వీటిలోనే. యీ చిన్న వలయాల్లోనే (వీటి పరిధిని యింకా కుంచింపజేసేది 'అందరికీ అర్థం కావాలి కదండీ' అన్న అర్థంలేని మాట, 'మేడమీది అల పైడిబొమ్మా ' అంటే అర్థం చేసుకున్నదెందరు? పాడుకోని వారెవ్వరు) ఆరుద్ర వైవిధ్యం చూపిన వైనాలు.

మొదట ప్రేమగీతాలు. 'కొండగాలి తిరిగిందీ, గుండె వూసులాడిం'దంటూ ప్రారంభించి 'పట్టపగలు సిరి వెన్నెల భరత నాట్యమాడిం'దంటూ ఆ హాయిని అభివర్ణించి చివర కవిగారి మంగళాశాసనం యేమిటనుకున్నారు. 'పడుచుదనం అందానికి తాంబూలమిచ్చింది.'ఇందులో ప్రాయం రాగం (రంగు, అనురాగం) తెస్తుందనే ధ్వనే కాక 'ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయిం'దనే వేదాంత బోధా వున్నవి. (ఉయ్యాల జంపాల – పెండ్యాల – తిలక్.)

తమ హృదంతరాలలో దాచుకున్న వలపు తలపులు దోచుకుని సినిమా పాటలు చేసి 'తమని' తెరకెక్కిస్తున్నాడని ఆరుద్రతో యింతవరకూ యే ప్రేమికుల జంటా తంటా పెట్టుకొనకపోవడం కొన్ని పాటల దృష్ట్యా ఆశ్చర్యకరమే. చూడండి మరి. 'ఆడపిల్లా మగవాడూ కలిసినప్పుడు అనుకునే మాటలూ రెండే రెండు ప్రేమలో పడ్డ (చెడ్డవారి సంగతీ ఆరుద్రనే అడగాలి. "సమాజం"లో 'కనుల నిదుర ') ప్రతివారికీ ఆ రెండు మాటలేవిటో, యెలా తెలుస్తాయో (నిజం: కవితా

చింతామణి చూడుడు) అలానే ఆ తొలిప్రేమల గిలిగింతలు మరచిన వారికీ ఆ అనుభవమే నోచుకోని వారికి తల క్రిందులా తపస్సు చేసినా అంతుబట్టవు. 'పులకరించే ప్రేమ విరిసి పూచినప్పుడు, గిలిగింతలు లెక్కిస్తే అవియే కోటి' అన్నట్లు యిటువంటి యెలతళుకులు ఆరుద్ర ప్రేమ గీతాల్లో కోకొల్లలు. (ప్రతిజ్ఞాపాలన – వేణు – సి.ఎస్.రావు).

ఇక చీకటి తప్పులకు తిన్నని ఆహ్వానాలు కొన్ని గలవు ఆరుద్ర రచనలలో. అయితే చెప్పే తీరు అందము వాటికి సాహిత్య గౌరవం కలిగిస్తున్నది. 'అసలీ అమృతం అనుమాటకి అర్థమిదేగా ముమ్మాటికీ' అనినా (కృష్ణలీలలు – దక్షిణామూర్తి – జంపన), 'ప్రతి పూవూ పుప్పొడి చల్లీ జతగానితో కలుపుతుందట' అని నందనవనాన్ని నోరారా వర్ణించినా (శ్రీకృష్ణ తులాభారం – పెండ్యాల – కె. కామేశ్వరరావు). 'రాగ తాళ భావయుతమూ (కాన) మోహామృతములోన మునగాలి స్వామి, అమర సౌఖ్యముతో సమమైనదేదీ ' అని సవాలు చేసినా (దేవాంతకుడు – అశ్వద్ధామ –సి. పుల్లయ్య). ఆ పిలుపులు మదనకదనానికి సిద్ధం కమ్మని భేరీలే.

అంత్య ప్రాస ఆంధ్ర భాషకు ఆది నుంచీ వున్నది అనే ఆరుద్ర మాట నిజమే. దానికి "కూనలమ్మ" సాక్ష్యం కూడా వుంది. కాని ఆరుద్ర మార్కు అంత్యప్రాసకు మాత్రం వరవడి దిద్దినది ఓగ్డన్ నాషెరీయే అంటే కాదనకూడదు మరి. ఇది బహువచనాలలో సాధించటం (జవాబులూ, గులాబులూ) గమనించదగ్గది. మాటల గారడీయో దేనికైనా పేరడియో తెలియదుగాని 'మనసే గని' (బంగారు పిచుక – మహదేవన్ – బాపు) ఆదిన తిరకాసు పెట్టించి ఆఖరున కాసుకిళ్ళీ తినిపించి కళ్ళు తిరిగించే రచన.

డెబ్బయ్యో ఎనభయ్యో డబ్బింగ్ చిత్రాలకు మాటలు పాటలు కుట్టిన దర్జీ. దర్జాగా ట్యూన్‌కి మాటలు వ్రాయగలడనే మాట నిస్సందేహం చేసిన ఆరుద్ర పాట 'చంటి బాబూ, బుచ్చిబాబూ ' (అందరూ దొంగలే – మహదేవన్ – రాజేంద్రప్రసాద్). హిందీ పాట వరసా, విరుపులూ తప్పక, తెలుగుదనాన్ని ఒప్పించి హాస్యరసం కుప్పించిన విధానం అద్వితీయం, వరసే ముందు సృష్టించే కొందరు సంగీత దర్శకులకు ఆరుద్ర తరచు జోడీ కావడానికి యిదీ కారణం (సలీల్, శంకర్ జైకిషన్).

అసలు అది సాహిత్యమే అనువాద సాహిత్యమని సంజాయిషీ యిచ్చుకోనక్కరలేదు సినిమా పాటలకు. వరసలు. సన్నివేశాలు. భావాలు ఎక్కడి నుంచైనా దిగుమతి చేయవలసిన అవసరం వస్తుంది. అగత్యం పడుతుంది. ఈ పని నేను చేయను అని మడి కట్టుకొనడం ఒక పద్ధతి. మాట్లాడకుండా ఆ భావాన్ని అనుసరిస్తూనే తెలుగుదనం కొరవడని పాట వ్రాసివ్వడం మరొక పద్ధతి. ఈ మేల్తరమైన పద్ధతే ఆరుద్ర అవలంబించకపోతే 'పడుచుదనం రైలు బండి ' (పెంకి పెళ్ళాం – ప్రసాదరావు – కె. కామేశ్వరరావు) ఆంధ్ర శ్రోతలకు అందకుండా పోయేది. దానికి ఆధారం సంతోషి "షెహనాయ్" చిత్రానికి వ్రాసిన 'జవానీకీ రైల్' అన్న హిందీ పాట. అయితే యేం 'కుర్రకారు పిల్లవాళ్ళు రాకూడదు, ముసిలివాళ్ళు

పిసినిగొట్లు రామాళదు, ఇక్కట్టులు లేకుండుట టిక్కట్లండి. చక్కగా నవ్వేవాళ్ళే (పదుచుదనం రైలు) బండెక్కండీ'లో ఏం తక్కువైంది గనుక. 'లవ్ యీజ్ బ్లైండ్'అన్నది అప్రాచ్యులు, ఆర్యులు కాదు అని ఆరుద్ర నీతి వాక్యాలు వల్లిస్తే 'అనురాగానికి కనులేలేవని ఆర్యులు అన్నారు' వంటి పాట (స.శి.అ. చింతామణి – మహదేవన్ – ఎస్.డి.లాల్) సిద్ధించి వుండేది కాదు కదా! 'ముమ్ముముద్దంటే చేదా 'కి (అదృష్టవంతుడు – మహదేవన్ – వి. మధుసూదనరావు) యిన్సిపిరేషన్ కార్మన్ ' మీరాండా యేనాడో పాడిన పాటలు (మమా, ఐయాయ్) అయితే మాత్రం యువ హృదయాలకు పైపాట పెట్టిన చక్కిలిగింతలు తగ్గినవా?

రెండు నగరాలు, రెండు కళాస్థావరాల గురించి చారిత్రక సత్యమనెడు గమ్యం వైపు పయనించడానికి ఆరుద్ర వ్రాసిన వేసిన పూ పాటలు, పూబాటలివి. 'ఇదేనండి యిదేనండి భాగ్యనగరం. మూడుకోట్ల ఆంధ్రులకు తమ కొత్త రాజధానిని పరిచయం చేసిన కమనీయ గీతం (ఎం.ఎల్.ఏ – పెండ్యాల – తిలక్). అంతకన్నా గొప్పది 'మహాబలిపురం ' (బాలరాజు కథ – మహదేవన్ – బాపు). ఒక విషయంలో పాండవుల రథాలు, రధాలూ పాండవులవీ కావు. అందుకనే 'పాండవుల రథాలనీ పేరు పడ్డవీ' అని మాత్రం అంటారు ఆరుద్ర. ఇంకా పురాతత్త్వవేత్తలను తికమక పెడుతున్న 'అర్జునాస్ పెనన్స్'ని యిలా సమర్థించారు. '(అర్జునుని తపస్సును) సృష్టంతా కదలివచ్చి చూడసాగెను, ప్రతిసృష్టి యీ శిల్పమని పేరు వచ్చెను.'

హాస్యగీతాలంటే అదేమి ఖర్మమో కాని (కొంత – దొడ్డమ్మ, డా.సి.హెచ్.బి వెంకటాచలం, వల్లూరి జగన్నాథం ఇత్యాది ఆది కామిక్ రికార్డు కర్తల పుణ్యం మిగతా కొలంబియా కొంచెం తక్కువగా హెచ్.ఎం.వి కంపెనీల బూతు రికార్డుల పాపం) బూతు వుండాలన్న నమ్మకం మొదటినుంచీ వున్నట్టుంది. ఇదీ, లేకపోతే పిచ్చి కేకలు, వెర్రి కూతలు. దీనికి దోహదం చేసిన రచయితలే యెందరో దానికి అపప్రథలైన సున్నితమైన హాస్యగీతాలనూ వ్రాశారు. ఏమైనా తెలుగులో హిందీలో వచ్చినటువంటి అపూర్వమైనవి సంగీత సాహిత్య డోలలు (సి.రామచంద్ర – సంతోషి కలయికలైన 'నమస్తే నమస్తే ', 'మేరేపియా' 'డాడీజీ ' పాటలే మరొకరివి కావు, లేవు) రాలేదు. సాహిత్యంలో హాస్యరసం గుప్పించడంలో వాటికేమాత్రం తీసిపోనివి ఆరుద్రవి రెండు మాత్రం ఉదహరిస్తాను.

'థడికో థడికో' కించిద్భూతే. జానపద ధోరణిలో సాగింది కాబట్టి కొంత నయం. కాని యేవంకా పెట్టలేనివి 'గో గో గో గోంగూర ' (దేవాంతకుడు – అశ్వద్ధామ – సి.పుల్లయ్య) ఆంధ్రుల ప్రియతమ శాకంతో యిలా భేషైన హాస్యరస పాకం వండిన నలభీముడు ఆరుద్ర. 'సోడాసోడా ఆంధ్రా సోడా' (లక్ష్మీనివాసం – మహదేవన్ – వి. మధుసూదరరావు) యిటువంటిదే. ఒక ప్రత్యేక వర్గపు పరిభాష వాడి, వాడి అయిన హాస్యం పుట్టించడంలో ఆరుద్రకు లేనేలేరు జోడి. ఒక ప్లీడరు గుమాస్తా తన ప్రేయసితో యేమంటాడు? 'నువ్వంటేనే నాకు మోజు అలా, వ్రాసిస్తానే దస్తావేజు ' అని. 'నీ మనసు

నీ హృదయం ఎక్స్‌పార్టీలై తీసుకున్నాయి డిక్రీని నాపై, మీనులంటి నీ కన్నులు అమీనై జామీను లేని నా మదిని జప్తు చేసినై.' ఇంతకంటే బాగా యెవరైనా వ్రాయగలగవచ్చు కాని వ్రాయి యుండలేదంటే ఉండదనుకుంటా లిటిగేషన్. ఫోటో స్టూడియో ఓనరు 'తన హార్టు కదిపే ఆర్టు' గురించి అలానే పాట్లాడుతాడు (పల్లెపడుచు – ఎం.ఎస్.రామారవు – బోళ్ళ సుబ్బారావు) 'నేనే మాలిశ్‌వాలా ' కూడా యీ కోవలోదే (టక్కరి దొంగ చక్కని చుక్క – సత్యం – కె.ఎస్.ఆర్.దాస్.)

సమాజం మీద సెటైర్ వ్యంగ్యం ఆరుద్ర కలంలో చిందులు తొక్కుతుంది. ఒకచోట శివమెత్తి ఆడుతుంది. హాస్యంతోనే సుతిమెత్తని సుత్తిపోట్లు. సున్నితమైన సమ్మెట దెబ్బలు.

'చూశావా మానవుని లీలలూ దేవా' అంటూ ప్రశ్నిస్తూ ఒకపిల్లవాడు చివర వేసే బ్రహ్మముడి 'నీళ్ళలోన వున్నావు, రాళ్లలోన వున్నావు, అఖిల జగతిలోన నీవు లేని చోటు లేదుగాని. డబ్బులిచ్చుకుంటేనే దర్శనమిప్పిస్తానని, గర్భ గుడిలోన నిన్ను నిర్భంధించేశాడు ' (అక్క చెల్లెళ్ళు – పెండ్యాల – అమానుల్లా సార్వభౌమ) ఇటువంటిదే 'వందనాలు చేయాలి అందరికీ వంక దండాలు పెట్టాలి కొందరికీ ' (ఎం.ఎల్.ఎ — పెండ్యాల – తిలక్).

'పలుకే బంగారమాయెరా' సంఘంలో పరపతులను పెంచీ పరసతులను ఉంచీ పెద్దమనుషులుగానే చలామణీ అవుతున్న వారిపైన, 'ఏడవకు యేడవకు' యీనాడు ఎమ్మేలు బియ్యేలైన పట్టాదార్ల అవస్థలపైన గూబ గుయ్యమనే చెంపదెబ్బ (అందాలరాముడు – మహదేవన్ – బాపు).

విషాద రాగాన్ని వ్యక్తం చేసే పాటలంత తీయనివి లేవనే నమ్మికకు మరింత ఆసరా యిచ్చే పాటలూ వున్నవి ఆరుద్ర ఖజానాలో. ఒక తల్లి తన పాపను యేమని జోకొడుతున్నదో వినండి. అందులో లాలన యెంత వుందో ప్రపంచం గూర్చి హెచ్చరికా అంతే వున్నది. 'ఆడజన్మకు కంటినిండా నిదుర రెండుసార్లేనమ్మా రెండేసార్లు. అన్నమెరుగని బాలప్రాయాన తొలిసారి. అన్నీ ముగిసిన అవసాన కాలాన కడసారి, బంగారు ప్రాయమిది పవళించవె తల్లీ, ఈ వయసు దాటితే నిదురేది మళ్ళీ ' (పిన్ని – టి.వి.రాజు – ఎ.ఎ.సుబ్బారావు).

తన నోముల పుణ్యము యశోద యింట పండుట గురించి దేవకి తలపోత. 'ఎన్ని పూజలు చేసెనో నా కన్న తండ్రికి తల్లియైనది, కన్నులకు పండగ చేసే వెన్న దొంగను సాకుచున్నది – కొలది నోములు నోచినానేమో వెలది మా యశోద కన్నను ' (కృష్ణలీలలు దక్షిణామూర్తి – జంపన).

తన జీవిత సర్వస్వం పోగొట్టుకున్న దేవదాసు పిచ్చి ప్రేలాపన 'ఇది నిశీథ సమయం, అది తిరుగులేని పయనం – సమయం, భ్రాంతి. పయనం మాయ – యిరుసే లేని చక్రం – జీవితం యేమిటి? వెలుతురూ చీకటి (దేవదాసు – రమేష్ నాయుడు – విజయనిర్మల). ఈ పాటలు చూసే ఒకరు 'గురువుగారిని మరిపించారు సార్ ' అని పొగడబోతే 'తప్పు. గురువుగారిని తలపించాను' అని నిజం నిర్భయంగా ఒప్పుకున్న ఘనుడు ఆరుద్ర. 'యమునా తీరమున 'లోనూ (జయభేరి

– పెండ్యాల – పిపుల్లయ్య) "వీరాంజనేయ" (ప్రకాశరావు – కామేశ్వరావు) పాటల మాటల పూరణంలోను సత్ గురువును అనుసరించినా  అనుకరించినా అది గురుతర కార్యమే అని ఒప్పుకుని ఒప్పించిన ధీరుడు ఆరుద్ర.

ఇక ఏ కోవకూ చెందని కొన్ని పాటలు. 'అందాల గని, బృందావని, లావణ్య రమణి మా యమునా నది, యెలుగెత్తి పిలిచాయి లేలెమ్మని ' (కృష్ణలీలలు – దక్షిణామూర్తి – జంపన) ఇంత చల్లని రేయినీ, ఇంత చక్కని హాయినీ ఆనాడు రమాధవుడు పిలిపిస్తే పిలిపించాడు కనక. ఈనాడు రప్పించింది మాత్రం రామాధవుడే.

దాదాపు ప్రతి మనిషికీ చిన్ననాటి స్నేహాలు, నాటి ఆగడాలు ఎంతో తీపి గుర్తులుగా మిగిలి పోతాయి. పెద్దవకుండా, పెద్దరికపు బరువు బాధ్యతలు, వలపు వావులు స్వీకరించకుండా ఉండలేము. కాని పచ్చలు తాపిన ఆ విచ్చలవిడి జీవితానికి వీడుకోలిచ్చేటప్పుడు మనసులో ఎంత బాధ ముసురుతుంది. 'తొలినాటి స్నేహితులారా, చెలరేగే కోరికలారా (ఇక్కడ శ్లేషాలంకారం), ప్రియురాలి వలపు కన్నా నునువెచ్చనిదేదీ లేదని నిన్నను నాకు తెలిసింది. ఒక చిన్నది నాకు తెలిపింది, ఆ ప్రేమ నగరుకే పోతాను, ఈ స్నేహనగరుకు రాను. ఇక రాను, టాటా, వీడుకోలు, గుడ్‌బై, ఇక సెలవు' దానికి ప్రతీక (బుద్ధిమతుడు – మహదేవన్ – బాపు). 'ఇదేమి లాహిరి, ఇదేమి గారడి, ఎడారిలోన పూలు పూచెనెంత సందడి ' (ఈడుజోడు – పెండ్యాల – తిలక్) తొలిసారిగా ప్రేమను బడిన వారికి కంటికి చెవికి ప్రతి దృశ్యం కావ్యంలాగా ప్రతి మాటా పాటలాగా వుంటుందనటానికి ఆరుద్ర రసోదాహరణం.

సమాజంలో మంచిని ప్రోత్సహించేవే నిజమైన జాతీయ గీతాలు. జాతికంతా మేలు తలపెట్టేవి కనుక, 'నమోనమో బాపు, మాకు న్యాయమార్గమే చూపు' (ఎం.ఎల్.ఎ. పెండ్యాల తిలక్) అని సత్యఋషిని ప్రార్థించినా (ధర్మదేవత నాల్గుపాదములు, బ్రహ్మదేవుని నాల్గు వేదములు, ధర్మ భూమిలో మరలా నిలిపీ నిర్మల బోధలు చేసిన గాంధీ మహాత్ముని). 'వీలు చూసి జనుల ఒరకు మేలు చేయమన్నా (శభాష్ పాపన్న కోదండపాణి – ఎస్.ఎస్.లాల్) అడుగుజాడ గురుజాడదైతేనేం మంచి ప్రబోధ గీతాలు.

ఇక పౌరాణిక చిత్రాలకు ఆరుద్ర వ్రాసిన పాటలు కొన్ని. పాత్ర చిత్రణలోగాని, శీలాల విశ్లేషణలో గాని అట్టే కొత్తదనం వుండటానికి అవకాశం లేని సన్నివేశాలివి. అందులోనే ఆరుద్ర జొనిపిన అరుదైన సొగసులు.

ప్రతి పెళ్ళిపిలుపు మీద వేసే శ్లోకమే 'జానక్యాః' కాని ఇంత అందంగ యింతకు ముందు (ఒక ప్రయత్నం దాఖలా వుంది) అమరలేదు. 'ఎర్రని దోసిట తెల్లని ముత్యాలు సీత తలంబ్రాలకై తీసింది. తీసిన ముత్యాలు దోసిలి రంగుతో యింపుగా కెంపులై తోచాయి. కెంపులను కొన్నవి రామయ్య మై చాయ సోకగా నీలమ్ములైనాయి.' ఇంతవరకు చక్కగా చుట్టిన మహతాబు పగిడీ. 'ఇన్ని రంగులు చూసి ఇంతి తెలబోయింది, ఇనకులుడు చిరునవ్వు నవ్వాడు '  అన్నది దానిపై కలికితురాయి (సంపూర్ణ రామాయణం – మహదేవన్ – బాపు) రాముడు దేముడని ప్రతి బడిపిల్లవానికీ తెలుసు.

ఎందువలన? బడిపిల్లలకూ బోధపడే విధాన ఆరుద్ర బోధన ఇదిగోనండి. 'తండ్రి మాటకై పదవుల త్యాగమే చేసెను, అనుభవించదగిన వయసు అడవిపాలు చేసెను, ధర్మపత్ని చెరబాపగ దనుజుని దునుమాడెను, ధర్మము కాపాడుటకా సతినే వీడెను అందాల రాముడు, అందువలన దేముడు '. అంత్యప్రాసల సొంపు రుక్మిణీ కల్యాణ ఘట్టంలో ఆరుద్ర నింపు సౌరు గమనింపుడు. 'కన్నెపిల్ల మనసు మీ అన్నకేమి తెలుసు. శిశుపాలుడికన్నా ఆ శ్రీ కృష్ణుడు మిన్న. రమణి ప్రేమ సొంపు నువు రాయబారమంపు రుక్మిణమ్మా నువ్వు కృష్ణమూర్తితో కులకవమ్మా' (ఉయ్యాల జంపాల పెండ్యాల – తిలక్).

దశావతారాలు జయదేవుడు నుంచి పెదపులివర్రు కవివరేణ్యుల దాకా ఎందరో వ్రాశారు. సినిమాలలోనూ ఉపయోగించారు. కొన్ని పాత పల్లెపాటల (అన్నమయ్యను కూడానా?) ఆధారంగా ఆరుద్ర వ్రాసిన పాట 'చెంచీత ఆగవే' (అడుగు జాడలు – వేణు – చాణక్య) చెప్పుకోదగింది. హరికథల రూపంలో దక్షుని కథా (దక్ష యజ్ఞం – హనుమంతరావు – నాగభూషణం) భద్రాచల కథ (అందాల రాముడు – మహదేవన్ – బాపు) సులభంగా వ్రాసి సూక్ష్మంలో మోక్షం చూపించారు.

మళ్ళీ ఇన్ని బంధనాలలోనే హాస్యం కూడా. 'ఇంద్రలోకము నుంచి ' అన్నది (జయభేరి – పెండ్యాల – పి.పుల్లయ్య) స్థూలంగా చూడటానికి పారిజాతాపహరణ యక్షగానమైనా సత్య మాటల్లో తేలుతుంది హాస్యరసపు పస. 'చక్కని చుక్కను సత్యను కాదని అక్కకు యిస్తాడా మిక్కుటమైన టక్కరి కృష్ణుడు యిక్కడి కొస్తాడా, కొట్టనా తిట్టనా?' ఆ తరువాత కృష్ణుని అనునయం 'చిన్నదానా నీకు చెట్టు తెచ్చిస్తాను. ఆ పువ్వు పోనివ్వు చిన్ననవ్వు నవ్వు ' నిజంగా కూచిపూడి భరతం పట్టడమే.

పాట రాణించుటకు కారణాలెన్నో వుంటాయని చెప్పుకుని సంగీత దర్శకుని, దర్శకుని పేర్కొనడంలో వైరుధ్యమేమీలేదు. పాట తయారయేటప్పుడు దగ్గర వుండేది వాళ్ళు. సన్నివేశం ఒకరు చెప్పితే సంగీతం ఒకరు పొదిగితే తయారయేది సినిమా పాట. అందుకే వారిద్దరు పేర్కొనబడటం. ఎన్నో మారులు పాడినవారు జోడించిన సొబగూ తీసివేయవలసినదేం కాదు.

మరి ఒక్క ఉదాహరణ చివరిది. మా గురువులు మెచ్చినదన్న ఖితాబే చాలు. వివరణ అక్కరలేదు.

ఎవరు కన్నారెవరు పెంచారు
నవనీత చోరుని గోపాలబాలుని

నోము నోచి నెలలు మోసి
నీల మేఘశ్యాము కన్నది దేవకి
లాలపోసి పాలుపట్టి
జోలపాడే కలిమిగలిగె యశోదకి

తడవ తడవకు కడుపు శోకము
తాళజాలక పెంచనిచ్చెను దేవకి
తాను కనకయె తల్లి యయ్యెను
తనయుడాయెను దేవుడే యశోదకి
ఎవరు కనినా యెవరు పెంచినా
చివరి కతడానంద మిచ్చిన దెవరికి
అవనిలో తనపైన యెన్నో
ఆశలుంచిన వారికి తన నాశ్ర
యించిన వారికి
(ముద్దు బిడ్డ – పెండ్యాల – తిలక్)

ఒక కథలో మల్లాది రామకృష్ణశాస్త్రిగారు వ్రాశారు. 'మగవాని కోర్కెకూ ఆడదాని ముత్తయిదువతనానికి ముదిమి లే'దని శిష్యుడు ఛాయగా అనుసరించాడు 'ముత్యమంతా పసుపు ముఖమంతా ఛాయ ' అని (ముత్యాల ముగ్గు – మహదేవన్ – బాపు). మరొక రేణువు తన గొంతు కలుపుతున్నాడు ఒక చక్కని పాట యెన్నటికీ వసివాడని ఒక అందాల మాటని.

Post your comments